ప్రజాశక్తి

బుధవారం 8 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అదాని సిమెంట్‌పై ఆగ్రహ జ్వాలలు

- జనవాసాల మధ్య కాలుష్య కారక ప్లాంట్‌పై నిరసనలు
- ఫ్యాక్టరీ ఏర్పాటుపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడలో జనవాసాల మధ్య అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదనలపై స్థానికుల్లో ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడికక్కడే నిరసనలు జరుగుతున్నాయి. పెదగంట్యాడ మండల పరిధి అదాని గంగవరం పోర్టుకు ఎదురుగా ఉన్న 20 ఎకరాల భూమిలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ యూనిట్‌ను నిర్మించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 8వ తేదీన నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ వెనుక ఖాళీ ప్రదేశంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించింది. దీనిపై స్థానికులు, పెదగంట్యాడ, గాజువాక ప్రాంతల ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే గాజువాక నియోజవర్గం మొత్తం బూడిద కావడమే కాకుండా, గాజువాకతో పాటు, మల్కాపురం, ఎన్ఎడి కొత్త రోడ్డు వరకు దీని ప్రభావం ఉంటుందని ఐఐ రిపోర్టు తెలియజేసింది. పది లక్షల మంది తీవ్ర అనారోగ్యం పాలయ్య ప్రమాదం ఉందని రిపోర్టు సారాంశం. ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తి కార్యకలాపాలను ప్రారంభిస్తే గాజువాక మొత్తం ఖాళీ చేయాల్సి వస్తుందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ప్రాజెక్టు పరిధిలో 8 భూగర్భజలాలు, 5 ఉపరితల జలాలున్నాయి. నడుపూరు, నరవ మిగతా 2లో..

విపరీతమైన కాలుష్యం

ఈ ప్లాంట్ దుమ్ముధూళితో విపరీతమైన కాలుష్యం పెరుగుతుంది. ఇవన్నీ గాలిలో కలిసిపోయి మనిషి జీవనానికి ప్రమాదకరంగా మారుతుంది. గాజువాక నియోజకవర్గం మొత్తం బూడిదతో నిండి ఉంటుంది. ఇది చాలా ప్రమాదకరమైన ప్లాంట్. ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయరాదు.



డాక్టర్ ఎం.రమేష్‌కుమార్
జనవిజ్ఞాన వేదిక నాయకులు

ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు

అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు బుధవారం చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. పెదగంట్యాడలోని నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కన ఖాళీ గ్రౌండ్‌లో ఉదయం 10 గంటలకు సభ ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి 300 మంది పోలీసులను వివిధ స్టేషన్ల నుంచి సభా స్థలానికి మంగళవారం రాత్రి రప్పించారు. పెదగంట్యాడ మండల తహాశీల్దార్‌తోపాటు, జిల్లా రెవెన్యూ అధికారి, జాయింట్ కలెక్టర్, కాలుష్య నివారణ అధికారి ఈ సభకు హాజరుకానున్నారు. ఇద్దరు ఎసిపి స్థాయి అధికారులతో పాటు, స్టేషన్ పరిధిలో ఉన్న సిఐలు, ఎస్ఐలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి టెంట్ వేయనున్నారు.



మంగళవారం రాత్రి ఏర్పాటు చేస్తున్న టెంట్



స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న ఇండియన్ మహిళా క్రికెటర్లు

మహిళా క్రికెటర్ల ప్రాక్టీస్

ప్రజాశక్తి- విశాఖపట్నం

మహిళల ప్రపంచ కప్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లో పిఎం.పాలెంలోని విసిఎ, ఎడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఈనెల 9న దక్షిణాఫ్రికాతో మ్యాచ్ ఆడేందుకు నగరానికి చేరుకున్న భారత్ మహిళల క్రికెట్ జట్టు మంగళవారం స్టేడియంలో విస్తృతంగా సాధన చేశారు. ఇప్పటికే శ్రీలంక, పాకిస్థాన్ జట్లుపై ఘనవిజయం సాధించి, పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న భారతజట్టు పాయింట్ల పట్టికలో ఐదోస్థానంలో ఉన్న సఫారీలపైనా విజయం సాధించేందుకు చెమటోడ్చి స్టేడియంలో సాధన చేశారు. కాగా, భారత మహిళా క్రికెట్ జట్లు స్టేడియంలో సాధన చేస్తుందన్న సమాచారంతో పలువురు క్రికెట్ అభిమానులు వారిని చూసేందుకు ఆసక్తిగా స్టేడియం వద్దకు చేరుకున్నారు.

సిజెఐపై దాడి రాజ్యాంగంపై దాడే

వార్త 3లో..

ఓట్ చోర్‌పై సంతకాల సేకరణ

వార్త 5లో..

తాగునీటి సమస్యపై మహిళల నిరసన

వార్త 8లో..

మహిళా క్రికెటర్లు మిథాలీరాజ్, రావి కల్పనకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖపట్నం వేదికగా జరగనున్న ఇండియా ఆస్ట్రేలియా మ్యాచ్‌లో మహిళా క్రికెటర్లు దిగ్గజాలు మిథాలీ రాజ్, రావి కల్పనలకు అరుదైన గౌరవం లభించనుంది. ఈ మేరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 12న జరగబోయే మ్యాచ్ సందర్భంగా స్టేడియంలోని ఒక స్టాండుకు మిథాలీరాజ్ పేరు, ఒక గేటుకు రావికల్పన పేరు పెట్టనునట్టు ఎసిఎ ప్రకటించింది. మహిళా క్రికెట్ అభివృద్ధికి వారు చేసిన కృషి, సాధించిన విజయాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు.





కెజిహెచ్‌లో విద్యార్థులకు పలువురి పరామర్శ







విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, పిసిసి అధ్యక్షులు షర్మిల, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేట గురుకుల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురై కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిలను పలువురు నాయకులు మంగళవారం పరామర్శించారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, పార్వతీపురం జిల్లా కార్యదర్శి జిల్లా గంగునాయుడు, విశాఖ జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, ఎల్‌జె.నాయుడు, వివై.నాయుడు తదితరులు పరామర్శించారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి మంత్రి సత్యకుమార్ యాదవ్ కెజిహెచ్‌కు వెళ్లి విద్యార్థినులను పరామర్శించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని, భయపడవద్దని భరోసా ఇచ్చారు. విద్యార్థినులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు 53 మంది చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు రాగా మంగళవారం 13 మంది డిశ్చార్జి అయినట్లు మీడియాకు మంత్రి వెల్లడించారు.

వైఎస్.షర్మిల మాట్లాడుతూ, చంద్రబాబు 2047పై ఫోకస్ పెట్టడం కాదని, ఇప్పుడు ఈ బిడ్డల పరిస్థితిపై ఫోకస్ పెట్టాలని డిమాండ్ చేశారు. 2027 కల్లా రాష్ట్రంలో హాస్టల్స్ అన్నింటినీ స్వర్ణాంధ్ర హాస్టళ్లుగా మార్చాలని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం

అనారోగ్యానికి గురైన గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, గిరిజన విద్యార్థుల మరణానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అదాని సిమెంట్‌పై ఆగ్రహ జ్వాలలు

రిజర్వు ఫారెస్టులు, పలు రకాల జంతుజాతులు, చెట్లు, సంప్రదాయ పొదలు, మూలికలు, వృక్షసంపదలున్నాయి. ఇవన్నీ కలుషితమవుతాయి. ఈ పరిశ్రమ నిర్మాణం, ఉత్పత్తి క్రమంలో భారీ వాహనాలు, వేగం పెరిగి రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశముంది. నిర్మాణం, ఆపరేషన్ సమయంలో మిల్లుల శబ్దం, వాహనాల ట్రాఫిక్, మిక్సర్లు, క్రేన్లు, జనరేటర్లు, పంపులు, కంప్రెషర్లు, వైబ్రేటర్లు పరిసరాల్లో శబ్దం పెంచుతాయి. అధిక ధ్వని పెరిగి నివాసాలకు, పాఠశాలలకు తీవ్రమైన అంతరాయం ఏర్పడుతుంది.

ఇప్పటికే అదాని గంగవరం పోర్టు నుండి విడుదలవుతున్న రసాయనాలు, బొగ్గు, దుమ్ము, ధూళితో కూడిన కాలుష్యం వల్ల గంగవరం, పెదగంట్యాడ, గాజువాక ప్రభావితమవుతున్నాయి. ఆ కాలుష్య నివారణకు కాలుష్య నియంత్రణ మండలి గాని, జిల్లా అధికారులు గానీ ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఈ పరిశ్రమ నిర్మాణం జరిగితే ప్రజలు మరింత ప్రమాదంలో పడతారు.

ఈ ప్లాంట్ ఉత్పత్తికి క్లింకర్, జిప్సం, ఫ్లైయాష్, స్లాగ్ తదితర ముడి సరుకులు అవసరం. 30 వేల టన్నుల క్లింకరు, 2000 టన్నుల జిప్సం గంగవరం పోర్టు నుండి, 5 టన్నుల ఫ్లైయాష్ ఎన్‌టిపిసి నుండి, 5 టన్నుల స్లాగ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ నుండి తెప్పిస్తారు. దీంతో రవాణా పెరుగుతుందని, దాని ద్వారా వచ్చే బూడిద వల్ల భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం అవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉద్యోగులు వస్తాయని పెద్దగా ప్రచారం చేస్తున్నారు. కానీ వాస్తవానికి ప్రారంభ దశలో 60 ఉద్యోగులు మాత్రమే ఇస్తారని వారి నివేదికలో పేర్కొన్నారు. అందులో స్థానికులకు ఎన్ని ఉద్యోగాలు అన్నది ప్రస్తావించలేదు. ప్రజలకు హాని చేసి ఈ పరిశ్రమ ఏర్పాటు చేయరాదని సిపిఎం ఆధ్వర్యంలో అనేక అనేక సదస్సులు, ప్రచారాలు నిర్వహించారు. సిపిఎంతో పాటు స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో వివిధ కాలనీల్లో ప్రజలు, ప్రజా సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు కూడా ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలకు మద్దతు తెలుపుతున్నారు.

అనుమతులు రద్దు చేయాలి



అదాని సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు తక్షణమే రద్దు చేయాలి. బుధవారం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం. ఇది నిర్మాణం జరిగితే అందరమూ ఇళ్లు ఖాళీ చేయాల్సి వస్తుంది. ఇప్పటికే అదాని గంగవరం పోర్టుతో ఇబ్బంది పడుతున్నాం.

జాగర్లు శ్రీను
సీతానగరం, పెదగంట్యాడ

కెజిహెచ్‌లో విద్యార్థులకు పలువురి పరామర్శ

డిమాండ్ చేశారు. విద్యార్థులను పరామర్శించిన అనంతరం లోకనాథం మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలో ఉన్న సమస్యలు అధికార యంత్రాంగానికి గతంలోనే తెలిపామని, అయినా సమస్యలు పరిష్కరించకపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని చెప్పారు. ఈ ఘటన కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమన్నారు. మంచినీరు, వాష్ రూమ్స్, విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, బస చేసేందుకు సరిపడా గదులు, డైనింగ్ హాలు సదుపాయం లేనందువలనే ఇద్దరు విద్యార్థుల మరణానికి, 110 మంది విద్యార్థులు ఆసుపత్రిలో చేరడానికి కారణం అయిందని చెప్పారు.

ఉద్యోగుల బకాయిల విలువకు ప్రభుత్వ భూమి ఇవ్వాలి

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగుల బకాయిల విలువకు సరిపడా ప్రభుత్వ భూమిని ఇవ్వాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెవి.సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా మంగళవారం నగరానికి వచ్చిన ఆయన, వైఎస్ఆర్ పార్క్ డాలీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన బకాయిలు బాగా పెరిగిపోతున్నాయని, ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం చెల్లించటం లేదన్నారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోతే, వీటి విలువకు సరిపడా ప్రభుత్వ భూమిని ఉద్యోగులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావల్సిన బకాయిలన్నిటినీ వారి సర్వీస్ రిజిస్టర్‌లో ముందుగా పొందుపరచాలన్నారు. సమావేశంలో డి.రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ భూముల సమస్య పరిష్కరిస్తా

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని దేవాదాయశాఖ భూముల సమస్యలను రెండు నెలల్లో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. టిడిపి విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో మంగళవారం వెంకటేశ్వరమెట్ట సర్వే నెంబర్లు 1261/1450 దేవాదాయశాఖ బాధితులు ఎమ్మెల్యేను కలిసి సుదీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వంశీకృష్ణను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విల్లూరి చక్రవర్తి మాట్లాడుతూ, 100 సంవత్సరాలుగా నివాసితులుగా ఉన్న తమ దేవాదాయశాఖ సమస్య పరిష్కారం కాలేదని ఎమ్మెల్యే వంశీకృష్ణ అస్సెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారని తెలిపారు. నియోజకవర్గంలో 22ఎ ల్యాండ్ సమస్యతో ప్రజలకు బ్యాంకులోన్, ఇళ్లకు మరమ్మత్తులు చేసుకునే అవకాశం లేదని అసెంబ్లీలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. దక్షిణ నియోజకవర్గంలో సుమారు 20 ఎకరాలు భూమి ఎండోమెంట్ భూములుగా చిత్రీకరించి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దేవాదాయ శాఖకు 20 ఎకరాల భూమి వేరొక చోట కేటాయిస్తే ఎటువంటి అభ్యంతరం లేదని, ఎండోమెంట్ అధికారులు చెప్పిన సంగతి కూడా సభ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు చక్రవర్తి కృతజ్ఞతలు తెలిపారు. జివిఎంసి 33వ వార్డ్ క్లస్టర్ ఇన్‌చార్జి తిరుమల దేవి, శ్రీ వెంకటేశ్వర మెట్ట హౌస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి శ్రీను, ప్రెసిడెంట్ శరగడం మోహనరావు, హౌస్ వెల్ఫేర్ సభ్యులు కోరుబిల్లి దేవరాజ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వంశీ కృష్ణను సన్మానిస్తున్న విల్లూరి డాక్టర్ చక్రవర్తి తదితరులు

ఎస్‌డిఐతో హెచ్‌సిఎల్ అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ : ఆంధ్రప్రదేశ్‌లోని బలహీన వర్గాలకు చెందిన 30 మంది నిరుద్యోగ యువతకు పారిశ్రామిక వెల్డింగ్ పాత్రలో శిక్షణ అందించడానికి హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌తో విశాఖపట్నంలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌తో మంగళవారం ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనేవారిని అవసరమైన వెల్డింగ్ నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం పారిశ్రామిక రంగంలో వారి ఉపాధిని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. డైరెక్టర్ (కార్పొరేట్ ప్లానింగ్ పర్సనల్) సిఎండిఇ రాకేష్‌ప్రసాద్ ఈ బ్యాచ్‌ను ప్రారంభించారు.

ఎస్ఐపిపై అవగాహన

ప్రజాశక్తి -ఎంవిపికాలనీ : ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్స్ ఆధ్వర్యంలో పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం విశాఖలోని ఎస్‌బిఐ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్స్ అధికార ప్రతినిధి బి.సతీష్ మాట్లాడుతూ మ్యూచువల్ ఫండ్స్ ద్వారా దీర్ఘకాలిక పెట్టుబడులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎస్ఐపిలు మధ్యలో ఆపితే సంపద సృష్టికి విఘాతం కలుగుతుందని, మార్కెట్ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నప్పుడు చాలామంది పెట్టుబడిదారులు తమ సిస్టమేటిక్ ఇన్‌వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (ఎస్ఐపి) లను విరమిస్తున్నారని, తద్వారా రానున్న రోజుల్లో కలిగే ప్రయోజనాలను కోల్పోతున్నారని తెలిపారు. ఎస్ఐపిలను ఆపివేయడం ద్వారా కాంపౌండ్ ప్రయోజనాలను కోల్పోతారన్నారు. ఎస్ఐపిలను మధ్యలో ఆపివేయడం ద్వారా ఆర్థిక లక్ష్యాలు చేరుకోవడంలో జాప్యం ఏర్పడి రిటైర్మెంట్ తర్వాత వచ్చే నగదు తగ్గిపోతుందని, మార్కెట్లు పతనమైనప్పుడు ఎస్ఐపిలు మెరుగ్గా పనిచేస్తాయని, కావున పెట్టుబడిదారులు మార్కెట్ ఒడిదుడుకులకు భయపడకుండా ఎస్ఐపిలను కొనసాగించాలని సూచించారు.

ముగిసిన 'పోష్కన్' జాతీయ సదస్సు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ప్రాక్టీసింగ్ ఓరల్ పాథాలజిస్ట్స్ అండ్ మైక్రోబయాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి జాతీయ సదస్సు 'పోష్కన్ 2025' ఈ నెల 4 ,5, తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా విజయవంతంగా జరిగిందని ప్రాక్టీసింగ్ ఓరల్ పాథాలజిస్ట్స్ అండ్ మైక్రోబయాలజిస్ట్స్ అసోసియేషన్ డాక్టర్ భువన్ నాగ్‌పాల్, డాక్టర్ ఎం.నిహారిక తెలిపారు. ఈ సదస్సు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు, విదేశాల నుండి వచ్చిన ఓరల్ పాథాలజిస్టులను ఒకే డిజిటల్ వేదికపై ఏకతా చిహ్నంగా నిలిపిందని పేర్కొన్నారు. ఓరల్ డయాగ్నస్టిక్ సైన్సెస్‌లో ఆత్మనిర్భరత, ఆవిష్కరణ, సహకారం పెంపొందించడం, తద్వారా భారతీయ ఓరల్ పాథాలజిస్టులు విద్యా, క్లినికల్ రంగాల్లో బలపడేలా చేయడం ఈ సదస్సు ముఖ్యఉద్దేశ్యం అన్నారు. సదస్సును 'ఆత్మనిర్భర్ ఓరల్ పాథాలజిస్ట్' థీమ్‌తో నిర్వహించామని తెలిపారు. రెండు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఓరల్ డయాగ్నస్టిక్స్, మైక్రోబయాలజీ, హెడ్ నెక్ ఆంకాలజీ, క్లినికల్ రీసెర్చ్, ల్యాబ్ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్‌లో డిజిటల్ ఇన్నోవేషన్స్ వంటి ప్రధాన అంశాలపై శాస్త్రీయ సమావేశాలు జరిగాయి. సదస్సులో 18 మంది దేశీయ, అంతర్జాతీయ ప్రముఖ వక్తలు ప్రసంగించారు, వారు ఓరల్ కేన్సర్ డయాగ్నోసిస్, హెడ్ నెక్ ట్యూమర్స్, ప్రివెంటివ్ పాథాలజీ, యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్, ఫోరెన్సిక్ ఓడోంటాలజీ, బయోప్సీ టెక్నిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ డయాగ్నోస్టిక్స్ అంశాలను వివరించారు. వివిధ రాష్ట్రాల నుండి 250 మందికి పైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి భవనానికి వైఎల్ఎన్ రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : సీతారాం ఏచూరి స్మారక చిహ్నంగా పిఠాపురం కాలనీలో నిర్మిస్తున్న (సిపిఎం) విశాఖ జిల్లా కార్యాలయానికి విశాఖ నగరంలోని ప్రముఖ గైనకాలజిస్ట్, ప్రజా వైద్యులు డాక్టర్ వైఎల్.నరసింగరావు మంగళవారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. డాక్టర్ వైఎల్.నరసింగరావుకు సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తరపున పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, భవనం ప్రారంభం అయినప్పటికీ, ఇంకా ఫర్నిచర్, లిఫ్ట్, మైక్‌సెట్, సోషల్ మీడియా పరికరాలు, క్లాస్‌లకు అవసరమైన స్క్రీన్, ఎసిలు వంటివి ఇంకా సమకూర్చుకోవాల్సి ఉందన్నారు. డాక్టర్ వైఎల్ఎన్ ఇచ్చిన చెక్కును భవన నిర్మాణ పర్యవేక్షకులు ఎం.త్రినాధరావు స్వీకరించారు.



ప్రజాశక్తి 3
బుధవారం 8 అక్టోబర్ 2025

సిజెఐపై దాడి రాజ్యాంగంపై దాడే

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం



జగదాంబ జంక్షన్ వద్ద నిరసనలో మాట్లాడుతున్న లోకనాథం



జిల్లా కోర్టు వద్ద న్యాయవాదుల రాస్తారోకో

ప్రజాశక్తి- యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడమంటే, రాజ్యాంగంపై దాడి చేయటమే అవుతుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. ఇందుకు బాధ్యుడైన న్యాయవాదిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై మతోన్మాదుల దాడిని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సిజెఐపై మతోన్మాద అడ్వకేట్ ఒకరు కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరటం దేశంలో దుస్థితికి అద్దం పడుతుందన్నారు. మోడీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ఇప్పటివరకు ధ్వంసం చేస్తూ వచ్చారని ఆరోపించారు. ఇప్పుడు బహిరంగంగా సనాతనధర్మ పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే చెప్పు విసరటం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానం అన్నారు దీనిపై ప్రధానమంత్రి జవాబు చెప్పాలన్నారు. సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్న పవన్ కల్యాణ్ దీన్ని బలపరుస్తారా, వ్యతిరేకిస్తారా కూడా చెప్పాలన్నారు. దళితుల నుండి ఉన్నత స్థాయికి ఎదిగిన గవాయ్‌పై అగ్రకుల మతోన్మాద చర్యను ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, వి.కృష్ణారావు, నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, ఉరుకూటి రాజు, నాయుడు, జ్యోతీశ్వరరావు, కెఎం.కుమారమంగళం, పి.వెంకటరావు, చంటి పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నవయాంన బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసనలో పలు దళిత, బహుజన, బుదిస్టు,ప్రజాసంఘాల ప్రతినిధులు కొత్తపల్లి వెంకటరమణ, బూసి వెంకటరావు, వై.నూకరాజు పాల్గొన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యాన నిరసనలో పాత్రపల్లి చంద్రశేఖర్, ఎం .మన్మధరావు, నెయ్యల నాగభూషణరావు పాల్గొన్నారు.

దాడిని ఖండించండి : కెవిపిఎస్

సిజెఐ గవాయ్‌పై జరిగినదాడిని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. కెవిపిఎస్ జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు వైటి అధ్యక్షతన జగదాంబ సిఐటియు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుకోటి చిరంజీవి మాట్లాడుతూ, సిజెఐ రాజ్యాంగానికి అనువుగా తీర్పులు చెబుతున్నారని, దీన్ని సహించలేని సనాతన వాదులు బరితెగించి దాడి చెయ్యడం వారి చేతగాని తనానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో వైటి.దాస్, వై.రాజు, ఐసిఎస్ నాయుడు, పైడితల్లి, సరోజినమ్మ, ఇమ్మాన్యూలు, ఈశ్వరరావు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట:సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికి కొత్తకోటలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు.సంఘం సభ్యులు బి. బుల్లిబాబు, ఎంపిటిసి పూడి దేవ, పూడి అప్పారావు, కెవిపిఎస్ నాయకులు పూడి అర్జున్, ప్రసాద్, నాగరాజు, శివ, నేతాజీ, రాము తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బీఆర్ గవాయ్‌పై సనాతన ధర్మానికి మద్దతుగా నిలిచే ఓ న్యాయవాది దాడికి యత్నించడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుచ్చయ్యపేట మండలం రాజాంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్‌వి నాయుడు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానంలో అత్యున్నత స్థానంలో ఉన్న చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మతోన్మాదుల దాడి అత్యంత హేయమైనదని పేర్కొన్నారు. ఈ దాడికి పాల్పడ్డ ఉన్మాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, ముత్యాలు, మరియమ్మ అమ్మోజీ, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



బుచ్చయ్యపేటలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన

విశాఖ లీగల్ : సుప్రీం ప్రధాన న్యాయమూర్తిపై దాడి ఘటనను నిరసిస్తూ ఐలు, ఐఎల్ఎ, ఐఎల్‌వి, విశాఖపట్నం బార్ అసోసియేషన్ ప్రతినిధులు సంయుక్తంగా మంగళవారం జిల్లా కోర్టుల ప్రధాన ద్వారం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖ జిల్లా ప్రధాన సెక్రటరీ ఎన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగ ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన స్థానంలో ఉన్న న్యాయవాది ఇటువంటి హేయమైన ప్రవర్తనకు తప్పనిసరిగా శిక్ష పడాలని అన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బివి రామాంజనేయరావు అధ్యక్షులు అల్లి సురేష్ కుమార్, ఐఎల్ఎ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కెఎస్ సురేష్‌కుమార్ ఐఎల్‌వి ప్రతినిధి పాక సత్యనారాయణ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎంకే శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు

సీతమ్మధార.: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ బూటుతో దాడి యత్నాన్ని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ తరపున సొసైటీ ప్రధాన కార్యదర్శి జెవి ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం అంబేద్కర్ భవన్‌లో సమావేశంలో మాట్లాడుతూ చీఫ్ జస్టిస్‌పై దాడిని రాజ్యాంగ వ్యవస్థపై దాడిగా భావిస్తున్నామన్నారు. దాడి చేసిన న్యాయవాదిని సస్పెన్షన్‌తో సరిపెట్టకుండా అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఎఎంసి డైరెక్టర్లు కాంతారావు ,ఎస్ రాజులు అప్పారావు, పడమట్ల గంగరాజు, బైరవమూర్తి, లక్ష్మణరావు అప్పారావు పాల్గొన్నారు.

ఆనందపురం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్. గవాయిపై దాడిని ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ డివిజనల్ సభ్యులు దుమ్మెద అప్పలసూరి తీవ్రంగా ఖండించారు..

ఓటర్లకు డబ్బులు ఎర కేసు ఇద్దరికి జరిమానా

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : గడిచిన సాధారణ ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు ఎర చూపారనే ఆరోపణలతో నమోదైన కేసులో ఇద్దరు తెలుగుదేశం సానుభూతిపరులకు జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం ప్రదీప్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి ఓటర్లకు డబ్బును పంపిణీ చేయడానికి తీసుకెళుతూ పట్టుబడిన వీరికి ఒక్కొక్కరికి రూ.21,400 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలివి. వంత గొలుసుల శ్రీనివాసరావు , చింతపూడి తిరుపతిరావు అనే ఇద్దరు వ్యక్తులు 2024 మే 8న రాత్రి 11:30 గంటలకు సాధారణ ఎన్నికల సమయంలో కొమ్మాది దగ్గర ప్రత్యేక పోలీసు సిబ్బంది నిర్వహించిన వాహన తనిఖీల్లో పరిమితి మించి రూ. 17.70లక్షల నగదుతో పట్టుబడ్డారు. దీనిపై అధికారులు ఆరా తీయగా ఆ నగదు భీమిలి అసెంబ్లీ పరిధిలోని ఓటర్లకు ఇవ్వడానికి తీసుకువెళుతున్నట్లు గుర్తించారు. ఈమేరకు నిందితులపై భారతీయ శిక్షాస్మృతి 171 ,123 అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 188 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. భీమిలి సిఐ కేసు దర్యాప్తు చేసి సమర్పించిన నేరాభియోగపత్రం మేరకు విచారించిన న్యాయమూర్తి, రిప్రజెంటేటివ్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ కింద నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు.

భూములకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి -పద్మనాభం : రైతులందరూ తమ భూములకు వివరాలకు తప్పనిసరిగా ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని స్థానిక తహశీల్దార్ ఆనందరావు సూచించారు. మంగళవారం రెడ్డిపల్లి గ్రామ సచివాలయ ప్రాంగణంలో నిర్వహించిన భూముల రీసర్వే గ్రామసభలో మాట్లాడుతూ, భూములకు సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరగాలన్నా, వాటిని ఆధార్ అనుసంధానమై ఉండాలన్నారు. మండలంలోని పాండ్రంగి. రెడ్డిపల్లి పొట్నూరు గ్రామాల్లో మాత్రమే రీసర్వే జరగాల్సి ఉందన్నారు. రెడ్డిపల్లి పొట్నూరు గ్రామాల్లో రీసర్వేకు ఏర్పాట్లు చేస్తున్నామని, రెండు గ్రామాల్లో ముగ్గురేసి సభ్యులున్న రెండు బృందాలు రీసర్వే నిర్వహిస్తాయని, రైతులందరూ తమ భూములకు సంబంధించిన వివరాలను ఆధారాలతో చూపించి రీసర్వే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కె.దామోదర రావు, ఉపసర్పంచ్ ఎస్.ఆదినారాయణ, శేరిఖండం సర్పంచ్ పి.చెన్నారావు, ఎంఆర్‌ఐ శ్యామల, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయానికి స్వచ్ఛ గ్రీన్ అవార్డు

ప్రజాశక్తి- భీమునిపట్నం : 2025 ఏడాదికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రకటించిన స్వచ్ఛాంధ్ర గ్రీన్ అవార్డుకు ఎంపికైన జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం తరపున జెడ్‌సి ఒమ్మి అయ్యప్పనాయుడు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ నుంచి అవార్డును స్వీకరించారు. కార్యాలయ ప్రాంగణం, లోపల, వెలుపల పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండడం, ఇతర అంశాల ఆధారంగా తమ కార్యాలయానికి స్వచ్ఛ గ్రీన్ అవార్డు ప్రకటించినట్లు జెడ్‌సి అయ్యప్పనాయుడు తెలిపారు

దళిత ఉద్యమ నేత ఆనంద్‌కు నివాళి

ప్రజాశక్తి-వేపగుంట :దళిత హక్కుల కోసం పోరాడిన ఉద్యమనేత డెంకాడ ఆనందకుమార్ హఠాన్మరణంపై నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆనంద్ భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పశ్చిమ టిడిపి కార్యాలయానికి మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి- గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మంగళవారం సందర్శించారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే పెతంశెట్టి గణబాబు, ఆయన కుమారుడు మౌర్యసింహ మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ అప్పలనరసింహం విగ్రహానికి సత్య కుమార్ పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.. అనంతరం పలు రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, కూటమి నేతలు పరుశురాం రాజు, అంగ ప్రశాంతి ఉన్నారు.

నేరాలు ఘోరాలు

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -గాజువాక : కత్తితో దాడి చేసి గాయపరిచిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ సూర్యకళ తెలిపారు. వివరాలివి. అక్కిరెడ్డిపాలేనికి చెందిన మణిదీప్, మింది గ్రామానికి చెందిన ఉంగరాల దినేష్ ఇద్దరూ స్నేహితులు. ఫార్మా కంపెనీలో కలిసి పనిచేశారు. కొన్ని కారణాలతో మణిదీప్ పనిమానేయగా, అతనికి రావాల్సిన డబ్బులు సంబంధింత కాంట్రాక్టర్అతని మిత్రుడు ఉంగరాల దినేష్‌కు అందజేశారు. ఆ డబ్బులు ఇవ్వాలని తరచూ దినేష్‌కు మణిదీప్ ఫోన్ చేసినా ఇవ్వలేదు. ఈనెల 2న డబ్బులు ఇస్తానని చెప్పి అక్కిరెడ్డిపాలెం చెరువు దగ్గరకు మణిదీప్‌ను రప్పించిన దినేష్, అక్కడ కత్తితో మణిదీప్‌పై దాడిచేశారు. తప్పించుకున్న పారిపోతున్న మణిదీప్‌ను పరుగెత్తుకెళ్లి మరో రెండు కత్తిపోట్లు పొడిచాడు. మణిదీప్ కేకలు విని చుట్టుపక్కలవారు రావడంతో దినేష్ పరారయ్యాడు.. మణిదీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన గాజువాక పోలీసులు, దినేష్‌ను అరెస్ట్ చేశారు.

బాణసంచా అక్రమ నిల్వ కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలంలో అక్రమంగా మందు గుండు సామాగ్రి నిల్వ చేస్తున్నారన్న సమాచారం అందిన వెంటనే టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఇద్దరిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వాసు నాయుడు తెలిపారు.వివరాలివి. మండలంలోని నెలతేరు గ్రామం సమీపంలో దాసరి దేవుడు ఇంట్లో మందు గుండు సామాగ్రి తయారు చేస్తున్నారన్న సమాచారం ఆధారంగా పోలీసులు దాడి చేసి పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, వెల్లంకి పంచాయతీ బోడ్డపాలెం శ్రీకాకుళం కాలనీకి చెందిన చల్లా లక్ష్మి ఇంట్లో కూడా అక్రమంగా మందు గుండు సామాగ్రి తయారీ జరుగుతున్నట్లు తెలిసి దాడి జరిపారు. తన వద్ద సల్ఫర్, గన్ పౌడర్, ఐరన్ బీడు, తారాజువ్వలు వంటి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఘటనలో చల్లా లక్ష్మి, దాసరి దేవుడు పై కేసులు నమోదు చేసి, భీమిలి 15వ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. కేసులను సిఐ వాసునాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు

బాణసంచా నిల్వలపై దాడి

అలాగే వేములవలస గ్రామంలో బాణసంచా అక్రమ నిల్వలు చేసిన గొడౌన్‌పై మంగళవారం పోలీసులు దాడి చేసి రూ50వేలు విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వాసునాయుడు తెలిపారు. స్థానిక వ్యాపారస్తులు సిండికేట్‌గా ఏర్పడి, నవరాత్రుల సందర్భంగా అమ్మకానికి తెచ్చి, మిగిలిన బాణసంచాను గొడౌన్‌లో నిల్వ ఉంచగా పోలీసులకు పట్టుబడింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నారు

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని పాల్మన్ పేట బీచ్‌లో సోమవారం సాయంత్రం గల్లంతైన విద్యార్థి అశోక్(19) మృతదేహం మంగళవారం తెల్లవారుజామున లభ్యమైంది. కోటవురట్ల మండలం, కె.వెంకటాపురం గ్రామానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థి పోలుపర్తి అశోక్ స్నేహితులతో కలిసి సోమవారం సాయంత్రం పాల్మన్ పేట సముద్రతీరంలో స్నానం చేస్తుండగా ఉప్పెనలా వచ్చిన కెరటానికి అశోక్ సముద్రంలో గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం సాయంత్రం వరకు ఎంత వెతికినా అశోక్ మృతదేహం దొరకలేదు. మంగళవారం తెల్లవారుజామున అశోక్ మృతదేహం సముద్రం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ పురుషోత్తం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచ్ సీతయ్య మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని చందక మాజీ సర్పంచ్ రెడ్డి సీతయ్య (72) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడిగా, చందక గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు విశేష సేవలందించిన సీతయ్య మరణవార్త తెలిసి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి .సీతయ్య భౌతికకాయాన్ని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోరాడ రాజబాబు, పలువురు సర్పంచులు, రాజకీయనేతలు పార్టీలకు అతీతంగా సందర్శించారు.. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను

జయప్రదం చేయండి



ఐద్వా జెండా ఆవిష్కరిస్తున్న హేమలత

ప్రజాశక్తి -మాధవధార : అనంతపురంలో ఈనెల 13,14,15 తేదీలలో జరిగే ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం బిఎన్ఆర్ భవన్ ఆవరణలో ఐద్వా జెండాను జోన్ సీనియర్ నాయకులు హేమలత ఆవిష్కరించారు. కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షులు మాధవి మాట్లాడుతూ, మహిళల హక్కులు, మెరుగైన విద్య, ఉపాధి, ఆరోగ్యం కోసం మహాసభల్లో చర్చిస్తారన్నారు.. మహిళలపై హింసకు కారణమౌతున్న మద్యం మత్తు పదార్థాల నిషేధం, పరిశ్రమల్లో మహిళలకు తక్కువ వేతనాలు చెల్లింపు, అధిక పని, ఒత్తిడి, వేధింపులు, అలాగే రాష్ట్రంలో మైక్రో ఫైనాన్స్ , వడ్డీవ్యాపారం, పొదుపు పేరుతో జరుగుతున్న దోపిడీ తదితర అంశాలపై మహాసభల్లో చర్చ జరుగుతుందన్నారు. మూడేళ్ల మహిళ ఉద్యమ అనుభవాలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారన్నారు. మహాసభలకు వివిధ జిల్లాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరౌతారని, 13న జరిగే బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో కంచరపాలెం జోన్ అధ్యక్షులు కె.అనురాధ, కార్యదర్శి సిహెచ్ సుమిత్ర, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం, రసాయన శాస్త్రం బోధించుటకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి సురేఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్, నెట్ లేదా సెట్, పిహెచ్‌డి అర్హత కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ అర్హత సర్టిఫికెట్లతో ఈ నెల 10న, ఉదయం 11 గంటలకు కళాశాలకు హాజరు కావాలని సూచించారు.

పెన్షనర్ల నిరసన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ములగాడ : దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 14వరకు డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు స్థానికంగా నిరసనలు చేపట్టాలని ఎన్‌సిఇ యూనియన్ నిర్ణయించింది. ఈమేరకు పెన్సనర్ల నిరసనల పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ఈనెల 10న చలో నేవల్‌బేస్ ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. నేవల్‌బేస్ దగ్గర క్యాంటీన్ ఎన్నికల నిర్వహణ, అనంతరం తాజా పే ఫిక్సేషన్‌తోపాటు అన్ని అలవెన్స్‌లు లెక్కగట్టి పెన్షనర్లకు చెల్లించాలని ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని, నూతన పెన్షన్ చట్టాన్ని రద్దుచేయాలన్న డిమాండ్‌తో ఈనెల 10న ఢిల్లీలో ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే నిరసనకు సంఘీభావంగా ఈ నెల 11న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించారు. స్థానికంగా నిర్వహించే నిరసనల్లో పెన్షనర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- పెందుర్తి: జివిఎంసి 97 వ వార్డు చినముషిడివాడ, వుడా కాలనీలో దరి, రైల్వే విహార్ కాలనీలో రూ 20 లక్షలు జివిఎంసి నిధులతో చేపట్టే సిసి రోడ్ల నిర్మాణాలకు స్థానిక వార్డు కార్పొరేటర్,స్టాండింగ్ కమిటీ సభ్యులు వసంత శంకరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సిసి రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే కాలనీకి బస్‌సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కాలనీ అధ్యక్షులు విన్నకోట రాము, వార్డు సెక్రటరీ కిషోర్, గోవింద రావు, ధర్మారావు, కృష్ణారావు, విశ్వనాథరావు పాల్గొన్నారు.

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వద్దు

- జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట సిపిఎం, సిపిఐ, వైసిపి ఫ్లోర్ లీడర్ల నిరసన
- గాజువాక ప్రాంతంలో వెల్లువెత్తిన ఆందోళనలు .. అడ్డుకోవాలని విస్తృత ప్రచారం



జివిఎంసి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి, వామపక్ష ఫ్లోర్‌లీడర్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పెదగంట్యాడ వద్ద అదాని అంబుజా సిమెంట్ కంపెనీ నిర్మాణ ప్రతిపాదనను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ జివిఎంసి కౌన్సిల్ తీర్మానం చేయుటకు వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ ఫ్లోర్ లీడర్ ఎజె స్టాలిన్, వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, పెదగంట్యాడ వద్ద జనావాసాల మధ్య 4 మిలియన్ల సామర్థ్యంతో అదాని అంబుజా సిమెంట్ కంపెనీని నిర్మాణం చేయుటకు ఈనెల 8వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించిందన్నారు. ఈ సిమెంట్ కంపెనీ వల్ల గాజువాక ప్రాంతం మొత్తం ప్రమాదకరమైన దుమ్ము, ధూళి విషకణాలతో నిండిపోతుందని, ప్రజలు రోగాల బారిన పడతారని తెలిపారు. జివిఎంసి కౌన్సిల్‌ను సమావేశపర్చి ప్రతిపాదిత అదాని సిమెంట్ కంపెనీని వ్యతిరేకిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసి, ప్రతిపాదనలు రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలన్నారు.

ప్రాణాలర్పించైనా అడ్డుకుంటాం

గాజువాక : ప్రాణాలైనా అర్పిస్తాం గానీ, పెదగంట్యాడలో ఆదానే సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టేందుకు ససేమిరా అంగీకరించబోమని జన విజ్ఞాన వేదిక, వార్వా, సిపిఎం నాయకులు స్పష్టం చేశారు. డాక్టర్ ఎం రమేష్‌కుమార్, పాలూరి లక్ష్మణస్వామి, బిఎ త్రినాధస్వామి, సిపిఎం జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, నక్క రమణ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నడుపూరు జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్‌లో భీష్మించి కూర్చున్నారు. ఏం చేసినా తాము అక్కడి నుంచి వెళ్లేదిలేదని తిష్టవేయడంతో, సోమవారం రాత్రి ఆదానీ గంగవరం పోర్టు అధికారులు టెంట్‌లను ఖాళీ చేయాల్సి వచ్చింది. ఆందోళనకారులు రాత్రంతా అక్కడే పడుకొని నిరసన తెలిపారు. మంగళవారం ఉదయం హైస్కూల్ గ్రౌండ్‌కు వచ్చిన వాకర్స్‌కు సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మిస్తే కలిగే అనర్థాలపై వివరించి అవగాహన కల్పించారు జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఎస్ వి కె పరుశురాం, టిడిపి వైసిపి, పల్లా శ్రీనివాసరావు అన్నయ్య కుమారుడు పల్లా కార్తీక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి

ఆదానీ సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ సమతా నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు హేమంత్, నాయకులు, నక్క లక్ష్మణరావు, బి.సత్య నారాయణ, కొయ్య. శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు, ఎ.రామకృష్ణ, నాగేశ్వరరావు, రమణమూర్తి ఉన్నారు.

అమరావతి పార్కులో ప్రచారం

ఆదానీ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ సుందరయ్య కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్వీకే పరుశురాం ఆధ్వర్యంలో మంగళవారం అమరావతి పార్కులో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణ గ్రౌండ్‌లో నిరసన

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకోవాలి

గాజువాక.: ఆదానీ సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకోవాలని తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం తోకాడ సమైక్య, సిరియా, స్వర్ణసాయి, గ్రీన్‌లేస్ అపార్ట్‌మెంట్‌ల అసోసియేషన్ల ఆధ్వర్యంలో స్వర్ణసాయి అపార్ట్‌మెంట్‌లో సమావేశం నిర్వహించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అదానీ సిమెంట్ ఫ్యాక్టరీతో గాజువాక ప్రాంత ప్రజల మనుగడ ప్రశ్నార్థకమౌతుందని, ఎట్టిపరిస్థితుల్లోనైనా దీన్ని అడ్డుకుని తీరాల్సిందేనని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు ఎం రాంబాబు మాట్లాడుతూ, సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకోకుంటే గాజువాక జోన్ కాలుష్య కారకమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ చౌదరి, శ్రీధర్ కే రమణ, పోతిరెడ్డి, వర్మ, ఐదు అపార్ట్‌మెంట్‌ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు



తోకాడలో పోస్టరు ఆవిష్కరిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

ఘనంగా పద్మపూజిత, వీల్స్‌మార్ట్ దసరా లక్కీడ్రా



దసరా లక్కీడ్రా తీస్తున్న పద్మపూజిత,వీల్స్‌మార్ట్ సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార : పద్మపూజిత ఆటోఫైనాన్స్, వీల్స్‌మార్ట్ సంస్థ ఎదుగుదలలో ప్రజల సహకారం మరువలేనిదని సంస్థ అధినేత ఆర్ఎస్‌విపి. బసవరాజు అన్నారు. మంగళవారం దొండపర్తిలోని సంస్థ కార్యాలయంలో దసరాపండుగ లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 23ఏళ్లుగా పద్మపూజిత ఆటో ఫైనాన్స్ సంస్థ ఎన్నో మల్టీ బ్రాండెడ్ బైక్స్‌ను ఎన్నో లక్షల మంది వినియోగదారులకు అందించిందన్నారు. వాహనాల నాణ్యతతో కూడిన సర్వీస్ సెంటర్స్ అందుబాటులో ఉండేలా వినియోగదారులకు అందిస్తుండడంతో సంస్థపై ప్రజాదరణ చెక్కు చెదరకుండా ఉందన్నారు. ఇప్పటివరకు 50వేలమందికిపైగా వినియోగదారులు నెలసరి వాయిదాల పద్ధతిలో తమ సంస్థ ద్వారావాహనాలు పొందారన్నారు. అనంతరం 1200 మంది కూపన్‌దారులకు లక్కీడ్రా నిర్వహించగా, ముగ్గురు రూ.లక్ష చొప్పున బంపర్ బహుమతులను, ఆరుగురికి రూ.50వేలు చొప్పున, 12మందికి రూ.25వేలు చొప్పున నగదు బహుమతులు వరించాయన్నారు. మరో 24మందికి కన్సోలేషన్ బహుమతులు కింద గ్రైండర్స్ అందజేసినట్లు వెల్లడించారు.పద్మపూజిత ఆటోఫైనాన్స్, వీల్స్ మార్ట్ సంస్థ ప్రజల ఆధారభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. రానున్న కాలంలో మరిన్ని బ్రాండెడ్ వెహికల్స్‌ను అందించేందుకు సంస్థ కృషి చేస్తుందని భరోసానిచ్చారు .కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.సోమశేఖర్, ఎ.శ్రీనివాసరావు, సిహెచ్ సాయిబాబు, బిఎస్‌విబి. బాలాజీ, జి.రమేష్, బి.ఫణికుమార్, పివిఎస్ రాజు, కె.శివనారాయణ, మహేష్, రహీం, కిరణ్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న రఘు

ప్రజాశక్తి-వేపగుంట : సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం సినీ సంగీత దర్శకుడు, గాయకుడు, నటుడు, గీత రచయిత రఘు కుంచే దర్శించుకున్నారు. ముందుగా కప్పస్థంభాన్ని ఆలింగనం చేసుకుని ప్రార్థనలు చేయగా, తర్వాత అంతరాలయంలో స్వామిని దర్శించు కున్నారు. దర్శనానంతరం రఘు కుంచేనుఆలయ పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వర రావు స్వామిశేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్న సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి గుజరాత్ రాష్ట్రం, జామ్‌నగర్‌కు చెందిన ఎంఎస్. వెంకటేశ్వర్లు అనే భక్తుడు రూ.1,00,001 విరాళాన్ని అందజేశారు. విరాళా మొత్తాన్ని డొనేషన్ కౌంటర్ వద్ద నగదు రూపంలో సమర్పించారు.తానిచ్చిన విరాళంపై వచ్చే వడ్డీతో తన తండ్రి శ్రీనివాస్ శర్మ పేరున నిత్యాన్నదాన ప్రసాదం కొనసాగించాలని అభిలషించారు. విరాళదాతకు ఆలయ ఎఇఒలు వాడ్రేవు రమణమూర్తి, కె.తిరుమలేశ్వరరావు బాండ్‌ను అందజేశారు. స్వామి అంతరాలయ దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు.

టిడిపి బలోపేతానికి కృషి



మండల కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -తగరపువలస: క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నూతన మండల కమిటీ కార్యవర్గం మరింత కృషి చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. మంగళవారం చిప్పాడ గ్రామంలో నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతన కమిటీ సమన్వయంతో పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన ఏకైక పార్టీ టిడిపిఅన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్ సిక్స్‌తోపాటు మరిన్ని పథకాలను సైతం అమలు చేస్తున్నామని, అందులో ఆటో డ్రైవర్లకు రూ.15వేల ఆర్థికసాయం ఉందన్నారు. ప్రస్తుతమున్న టీచర్లలో 90 శాతం పోస్టుల నియామకం టిడిపి హయాంలోనే జరిగాయన్నారు.

పార్టీ రూరల్ మండల అధ్యక్షునిగా సరగడ అప్పారావు, ఉపాధ్యక్షులుగా గరికిన పరశురాం, ప్రధాన కార్యదర్శిగా పొట్నూరు రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి ఎల్లయ్య, చెల్లూరి సంతోష్, కె రామకృష్ణ తదితరులతో ఎమ్మెల్యే గంటా ప్రమాణస్వీకారం చేయించారు. పార్టీ యువనేత గంటా రవితేజ,పార్టీ నాయకులు చిక్కాల విజయ్‌బాబు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు అవంతి కళాశాల జంక్షన్ నుంచి సభాప్రాంగణం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గుర్తించిన ప్రదేశాలలో అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం జిల్లా కలెక్టరు అధ్యక్షతన కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు (బ్లాక్‌స్పాట్స్)గా గుర్తించిన 26 ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని, 15 రోజులలో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. బ్లాక్ స్పాట్స్ 26 ప్రాంతాలకు 200 మీటర్లకు ముందుగా హెచ్చరిక బోర్డులను ప్రతి యాభై మీటర్లకు ఏర్పాటు చేయాలన్నారు. ఓవర్ లోడు, అత్యధికవేగం, వ్యతిరేక మార్గంలో ప్రయాణాలపై చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో లంకెలపాలెం నుండి పాయకరావుపేట వరకు జాతీయ రహదారి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ రహదారులపై ఆక్రమణలు తొలగించాలని, పార్కింగు, దుకాణాలు ఏర్పాటు చేయకుండా నిరోధించాలని స్పష్టం చేశారు. మైనింగు ప్రాంతాలలో శాశ్వత తనిఖీ కేంద్రాలు ఏర్పాటుచేసి ఓవర్ లోడు, ఓవర్ స్పీడు, రాంగ్ రూట్ డ్రైవింగుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బొజ్జన్నకొండ వద్ద భారీ వాహనాలు యుటర్న్ తీసుకోకుండా నిరోధించాలని, వాహనాలు నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించేలా సిబ్బందిని నియమించి పర్యవేక్షణ చేయాలని రోడ్డు భవనాలు, రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రమాద కేసును ఐ-రాడ్ యాప్ నందు తప్పని నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, నర్సీపట్నం ఆర్.డి.ఒ. వివి రమణ, జిల్లా రవాణా అధికారి జి.మనోహర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హైమావతి, రోడ్లు భవనాలశాఖ ఇఇ ఎన్.సాంబశివరావు, డిఇఇ విద్యాసాగరరావు, పోలీసు, మైనింగు, ఆర్.టి.సి. అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్



నూతన ఎన్‌సిసి యూనిట్‌తో నీరజ్‌కుమార్, డాక్టర్ ఖాశీం

అయ్యన్న విద్యా సంస్థల్లో ఎన్‌సిసి యూనిట్ ఏర్పాటు

ప్రజాశక్తి-కె.కోటపాడు : కె.కోటపాడు అయ్యన్న విద్యా సంస్థలకు ఎన్‌సిసి యూనిట్ మంజూరైనట్లు 13వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ చెప్పారు. స్థానిక అయ్యన్న విద్యాసంస్థల్లో నూతన ఎన్‌సిసి యూనిట్‌ను నీరజ్ కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య, ఉద్యోగాలలో ఎన్‌సిసి శిక్షణ, క్రమశిక్షణ ఎంతగానో ఉపయోగపడతాయని, రిజర్వేషన్ పరంగా కూడా దోహదపడుతుందని తెలిపారు. అయ్యన్న విద్యా సంస్థలలో మొదటి బ్యాచ్ విద్యార్థులు ఎంతో శ్రద్ధ, క్రమశిక్షణతో మెరుగ్గా శిక్షణ పొందాలని ఆకాంక్షించారు. అంతకు ముందు బెటాలియన్ బృందం విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ సుమతి, ఎన్‌సిసి పీఓ చల్లా పైడంనాయుడు, హవల్దార్ సుజన్ సింగ్, హారిక, శేఖర్, రాంప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న వర్షపు నీటిలో చిన్నారుల నిరసన

చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : చినుకు పడితే చాలు మండలంలోని సింగన్నదొరపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ మొత్తం చెరువును తలపించేలా నీరు నిల్వ ఉండిపోతుంది. పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి ఇటీవల గోతులు తీశారు. తర్వాత వాటి పనులు మొదలు పెట్టకపోవడంతో పాఠశాల విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. ఇటీవల తరచూ కురుస్తున్న వర్షాలకు ఆ పునాదులలో వర్షపు నీరు చేరి తద్వారా పాఠశాల కూడా చెరువును తలపిస్తోంది. పాఠశాల ఆవరణలో కొన్ని శిథిలమైన భవనాలు కూడా ఉన్నాయి. ఎప్పుడు కూలిపోయి ప్రమాదం ముంచుకొస్తుందోనని పాఠశాల ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. పాఠశాలకు వచ్చే చిన్నపిల్లలకు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపాధి హామీ వేతనదారులకు ముఖ ఆధారిత హాజరు

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వేతనదారులకు "ముఖ ఆధారిత" హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆర్ పూర్ణిమ దేవి తెలిపారు. అనకాపల్లి జిల్లాలో అక్టోబర్ 4వ తేదీ నుండి వేతనదారులందరికీ ఎన్ఎంఎంఎస్ ఇకెవైసి చేయడం జరుగుతుందనియ చెప్పారు. ఇకెవైసిలో భాగంగా వేతనదారుని ముఖమును ఆధార్ కార్డ్‌లో ఉన్న ముఖముతో పోల్చి నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒకరికి బదులు మరొకరు పనికి రాకుండా నియంత్రించేందుకు ముఖ ఆధారిత" ద్వారా హాజరు వేసే పద్ధతి ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఇకెవైసి చెయ్యని వారికి హాజరు, వేతన చెల్లింపులకు అవకాశం లేనందున తప్పనిసరిగా ఉపాధి హామీ పథకం వేతనదారులు అందరూ ముఖ ఆధారిత హాజరుకు ఈకెవైసీ చేయించుకోవాలని స్పష్టం చేశారు.

జిల్లాలో1200 గోకుల షెడ్ల నిర్మాణమే లక్ష్యం

ప్రజాశక్తి-దేవరపల్లి : జిల్లాలోని 1200 గోకులం షెడ్లు రైతులకు మంజూరు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 1062, షెడ్లను మంజూరు చేశామని పశు సంవర్ధక శాఖ డిడి మోపాక చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని మారేపల్లి, ఏ కొత్తపల్లి పంచాయతీ శివారు సంజీవపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం దేవరపల్లి పశు వైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1500 మందికి రుణాలు ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు, గాయత్రి, మనిషా రాణి, ప్రియాంక తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ చోర్‌పై సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న ఏపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 47వ వార్డు పరిధి కంచరపాలెం కప్పరాడలో విశాఖ జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్ పడిమిని చంద్రశేఖర్ ఆధ్వర్యాన ఓట్ చోర్ గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిలా రెడ్డి ప్రజలతో మమేకమై వారి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఓటు చోరీ జరుగుతున్న తీరును ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు, నాయకులు అరుణ కుమారి, గాదం మహేష్, వేగి వెంకటేష్, గౌతమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన "ఓట్ చోర్- గద్దె చోడ్" కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేటలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గ కన్వీనర్ మారుతి నారాయణ చక్రవర్తి ఆధ్వర్యంలో చిత్రం మందిర్ జంక్షన్లో సంతకాల సేకరణ చేశారు. ఇందులో పాల్గొన్న అనకాపల్లి డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ ఓట్ చోర్-గద్దె చోడ్ నినాదం దేశవ్యాప్తంగా ప్రజాదరణ పొందిందని, ఇకపై ఈ నినాదాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్తామని తెలిపారు. దేశంలో ఓట్ల దొంగతనం జరిగిందని, దీనివల్లే బిజెపి గెలుపొందిందని సుబ్బన్న ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలవరపు అప్పలరాజు, గుమ్మళ్ల గోవింద, ఎం. శంకర్, ప్రగడ చక్రధర్ రావు, నడింపల్లి నూకరాజు, బర్రె జగన్నాథం పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త తనకాల అనంతరావు ఆధ్వర్యాన తిమ్మరాజుపేట జంక్షన్‌లో మంగళవారము ఓట్ చోర్ గద్దె చోడ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుండి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అనంతరావు ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన పార్లమెంట్, న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్‌ను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంవిఆర్ రాహుల్, పోలమరశెట్టి ఆదిమూర్తి, రావి రాం సత్యం, దొడ్డి రవి, బీశెట్టి మోహన్, కాంగ్రేగుల సంజీవ్, కాంగ్రేగుల లక్ష్మణరావు, నాగు మంత్రి సాయి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల పేరుతో భూ దోపిడీకి ప్రయత్నం


ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : కొత్త మెడికల్ కాలేజీ పేరుతో అనకాపల్లి చెరుకు పరిశోధన కేంద్రంలో ఉన్న భూములను దోచుకోవడానికి జగన్‌రెడ్డి ప్రయత్నం చేశారని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. ఇక్కడ రాజకీయ పార్టీలు తిరుగుబాటు చేయడంతో దోచుకోలేక పోయారన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నందున ఇక్కడ మెడికల్ కాలేజీ పెట్టవలసి ఉండగా ఎటువంటి సౌకర్యాలు లేని మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం ఏమిటనీ ప్రశ్నించారు. ఈ నెల 9న మాకవరపాలెంలో మెడికల్ కాలేజీని సందర్శిస్తానని చెబుతున్నారని, 5 సంవత్సరాల పాలనలో ఏమి చేసారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు కొట్టి రామకృష్ణ, బోడి వెంకటరావు, కాంగ్రేగుల సత్యనారాయణ, కుప్పిలి జగన్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి హెూల్ సేల్ కూరగాయల మార్కెట్ పరిసరాల్లో ప్రతి ఉదయం రోడ్లపై కూరగాయల విక్రయాలతో తీవ్ర ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐ సత్యనారాయణ మంగళవారం మార్కెట్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. రోడ్డుపై ఎవ్వరూ కూరగాయలు అమ్మకాలు చేయకుండా, కేటాయించిన స్థలాల్లోనే విక్రయాలు జరపాలని వ్యాపారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యతో రాకపోకలు సాఫీగా సాగుతుండటంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చౌడువాడకు రాష్ట్రస్థాయి స్వచ్ఛ గ్రామపంచాయతీ అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-కె.కోటపాడు : రాష్ట్రస్థాయి స్వచ్ఛ గ్రామ పంచాయతీ అవార్డును మండలంలోని చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సోమవారం ప్రదానం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో సర్పంచ్ కార్యదర్శి అవార్డులు స్వీకరించారు. ఈ అవార్డును ఒక బాధ్యతగా తీసుకుని చౌడువాడ పంచాయతీని ఎమ్మెల్యే బండారు సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని సర్పంచ్ ఎరుక నాయుడు తెలిపారు.



చంద్రబాబు నుండి అవార్డు అందుకుంటున్న దృశ్యం

అరుణ కుమారికి ఉత్తమ అంగన్వాడీ వర్కర్ అవార్డు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అమృతపురం-1 అంగన్వాడీ వర్కర్ గండి అరుణ కుమారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర అవార్డు పురస్కారం లభించింది. అనకాపల్లి పెంటకోట కల్యాణ మండపంలో సోమవారం జరిగిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అనకాపల్లి, మాడుగుల ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణ మూర్తి చేతుల మీదుగా ఈ అవార్డును అరుణ కుమారి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం ఐసిడిఎస్ సిడిపిఓ వి.లలితకుమారి, సూపర్వైజర్ అప్పల నర్సమ్మ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వివి రమణమ్మ, పలువురు అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



అరుణకు అవార్డు అందిస్తున్న ఎమ్మెల్యేలు కొణతాల, బండారు

ఆర్టీసీ ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులను మెరుగుపరచి అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ఆర్.టి.సి డిపో మేనేజర్‌కు సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. వర్షం పడినప్పుడు వర్షపు నీరు బస్ కాంప్లెక్స్ ఆవరణ లోనికి రావడం, మురుగు నీరంతా నిలిచి పోయి మట్టి బురదతో బస్ కాంప్లెక్సు చుట్టూ ఉండి పోవడం, కాంప్లెక్సు లో చెత్త పేరుకు పోయి ఉండటంతో ఆ ప్రదేశం అంతా దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు. మంచినీటి సరఫరా ప్రాంతంలో పరిశుభ్రత లేకపోవడం, మలమూత్ర శాలలలో అపరిశుభ్రత తో బస్ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, అయ్యగారువెంకటరమణ మూర్తి, బుగిడి నూకప్పారావు, పిరాట్ల నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిఐటియు నేత గనిశెట్టి, ఆశా వర్కర్లు

పిహెచ్‌సి వైద్యుల సమ్మెకు మద్దతుగా సిఐటియు నిరసన

ప్రజాశక్తి-పరవాడ : సెప్టెంబర్ 26వ తేదీ నుంచి రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని వారి డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పరవాడ మండలం వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ పిహెచ్‌సి వైద్యుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పిహెచ్‌సి డాక్టర్లకు ఇన్ సర్వీసులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోట పునరుద్ధరించాలని, సమయం నిర్దేశిత ప్రమోషన్స్, ట్రైబల్ అలవెన్స్, 104 సంచార చికిత్స అలవెన్స్, నేషనల్ ఇంక్రిమెంట్ వాటి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, దేవుడమ్మ, సైదులమ్మ, వరలక్ష్మి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

పిఆర్ఎస్ఐ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-మధురవాడ : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ.) విశాఖపట్నం చాప్టర్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. మంగళవారం గీతం వర్సిటీలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో చైర్మన్‌గా హెచ్‌పిసిఎల్, విశాఖ రిఫైనరీ పిఆర్ఓ, సిఎస్ఆర్ కన్సల్టెంట్ ఎంకెవిఎల్ నరసింహం, వైస్‌చైర్మన్‌గా శంకర్ ఫౌండేషన్ సంస్థ పిఆర్ఓ బంగారురాజు, కార్యదర్శిగా విశాఖ డెయిరీ పిఆర్ఓ ఎ. గోవిందరావు , కోశాధికారిగా గీతం వర్సిటీ పిఆర్ఓ ఎన్‌వి. నరసింహం, కార్యవర్గ సభ్యులుగా ఎస్. శ్రీనివాస్‌కుమార్, ఎన్. నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డిసిఐ. విశ్రాంత అధికారి, పిఆర్ఎస్ఐ. సీనియర్ సభ్యుడు కె. రామారావు వ్యవహరించారు. పిఆర్ఎస్ఐ. నేషనల్ కౌన్సిల్ మీటింగ్‌ను విశాఖపట్నంలో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని నూతన చైర్మన్ ఎంకెవిఎల్.నరసింహం తెలిపారు. నూతన కమిటీని అభినందించారు.

కాలువ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జీవీఎంసీ 84వ వార్డు పరిధి సాలాపువానిపాలెంలో చేపడుతున్న మురికి కాలువ నిర్మాణ పనులను కార్పొరేటర్ చినతల్లి పరిశీలించారు. రూ. 40 లక్షల నిధులతో దీనిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి వార్డు ఇన్చార్జి మాదంశెట్టి నీలబాబు, తలారి ప్రసాదు, సాలాపు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డ్స్ రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ కోటిబాబుకు డాక్టరేట్

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : పోలీస్ విధులు పక్కాగా నిర్వహిస్తూనే సామాజికంగా అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్న హోంగార్డ్స్ రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ దాడి కోటిబాబుకు గౌరవ డాక్టరేట్ లభించింది. కిర్లంపూడిలో జన్మించిన ఆయన ప్రస్తుతం అనకాపల్లిలో నివాసం ఉంటున్నారు. 2000 సంవత్సరం నుండి ఉద్యోగం ఎక్కడ నిర్వహించినా ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఏదో రూపంలో సహాయపడటం అలవాటుగా మార్చుకున్నారు. ఈ క్రమంలో యుఎస్ఎకు చెందిన ప్రతిష్టాత్మకమైన డే స్ప్రింగ్ తెలోజికల్ యూనివర్సిటీ గౌరవ డాక్టర్‌ను ప్రకటించింది. దీనిని డల్లాస్ ప్రతినిధుల సమక్షంలో కోటిబాబు అందుకున్నారు. కోటిబాబు కృషికి డాక్టర్ దక్కడం పట్ల అనేకమంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న కోటిబాబు

పనిగంటల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకై 8 గంటల నుంచి 13 గంటలకు పెంచిన పనిగంటలను వెనక్కి తీసుకోవాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనకాపల్లి ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు, కార్మిక సంఘాల నాయకులు కర్రి అప్పారావు, గండి నాయనబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. అందులో భాగంగానే 8 గంటల పని దినాన్ని13 గంటలుగా మారుస్తూ కూటమి ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఒకవైపు కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఢిల్లీ వేదికగా కార్మిక వర్గం గొంతెత్తి పోరాడుతుంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేస్తూ పని గంటలు పెంచడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు ఒకలా, గెలిచిన తర్వాత మరోలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. తక్షణమే పెంచిన పనిగంటలను తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.తెల్లయ్యబాబు, బి.ఉమామహేశ్వరరావు, రైతు నాయకులు యు.శివసూర్య నారాయణ, అల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం అనకాపల్లి కలెక్టరేట్లో వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి రచించిన రామాయణం ద్వారా మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శ భావాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అవలంబించుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎస్పి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్లు ఎస్.బాల సూర్యారావు, లక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీవిఎంసి అదనపు కమిషనర్లు డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, పరిపాలన విభాగాధికారి అప్పలనాయుడు, పాల్గొన్నారు.

వైఎస్.జగన్ పర్యటనను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్

ప్రజాశక్తి-పరవాడ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఈనెల 9న నర్సీపట్నం పర్యటనను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పరవాడ మండల వైసీపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు కోన రామారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో అదీప్ రాజ్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. జగన్ పర్యటన సందర్భంగా లంకెలపాలెం కూడలిలో 5 వేల మంది కార్యకర్తలతో ఘన స్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, సీనియర్ నాయకులు గండి రవికుమార్, చుక్క రామునాయుడు, బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు ఇతర నాయకులు పాల్గొన్నారు.


యస్.రాయవరం : ఈ నెల 9న వైఎస్.జగన్ పర్యటను జయప్రదం చేయాలని వైసిపి పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు పిలుపునిచ్చారు. మండలంలోని అడ్డరోడ్డు వైసిపి కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు యస్ఎన్ మధువర్మ, నాయకులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి

ప్రజాశక్తి-వడ్డాది : పిడుగుపాటుకు పాడిఆవు మృతి చెందగా, రైతు త్రుటిలో ప్రాణాప్రాయం నుంచి తప్పించుకున్న ఘటన మండలంలోని ఆర్.భీమవరం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన రైతు రొంగలి చిన్ననాయుడు సాయంత్రం ఐదు గంటల సమయంలో స్థానిక సోమయాజుల చెరువుకు సమీపంలో ఉన్న పొలాలలో తన పాడి అవును మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షానికి అకస్మాత్తుగా పిడుగు ఆవుపై పడింది. దీంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. పిడుగు పాటు గమనించిన రైతు చిన్న నాయుడు అక్కడ నుంచి తప్పించుకోవడంతో త్రుటిలో ప్రాణాప్రాయం తప్పింది. తమ కుటుంబ జీవనాధారంగా ఉన్న ఆవు మృతి చెందడంతో దాదాపు రూ.70 వేలు నష్టం జరిగిందని, జీవనోపాధి కోల్పోయామని ఆ కుటుంబం సభ్యులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. మృతి చెందిన పాడి ఆవును స్థానిక పశు వైద్యాధికారి పరిశీలించి పై అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే బాధిత రైతు చిన్ననాయుడు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక మాజీ సర్పంచ్ మలిరెడ్డి బాబ్జి కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండల పరిషత్తు సర్వ సభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపిడిఓ సిహెచ్.చంద్రశేఖర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి కలగ లక్ష్మి అధ్యక్షతన జరుగు ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ప్రభుత్వ శాఖ అధికారులు హాజరు కావాలని కోరారు.


బోనస్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులపల్లి పిఎసిఎస్‌లో బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-మునగపాక

మండలంలోని నాగులపల్లి పిఎసిఎస్ సభ్యులకు మంగళవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చేతుల మీదుగా బోనస్‌లు పంపిణీ చేశారు. 2024-25 సంవత్సర సంఘం నికర లాభం నుండి 3,655 మంది సభ్యులకు గాను 15 శాతం బోనస్ రూ.6 లక్షల 60 వేలు అందజేశారు. సమావేశంలో పిఎసిఎస్ చైర్‌పర్సన్ ఎల్లపు వెంకట భాస్కరరావు, డైరెక్టర్లు కొంతం జగదీష్, సుందరపు శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, ఇతర నాయకులు నూక నర్సింగరావు, దాడి మురళి నాయుడు, జెకె నాయుడు, పోలమర శెట్టి నూకలయ్య, గనిరెడ్డి సూర్య అప్పారావు, సంఘ కార్యదర్శి మల్ల స్వామి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకునికి గాయాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

విద్యుత్ షాక్ తగిలి యువకునికి గాయాలైన సంఘటన బుచ్చయ్య పేట మండలం చిట్టియ్య పాలెంలో చోటుచేసుకుంది. గ్రామంలో విద్యుత్ అవసరాలు తీర్చే సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గ్రామానికి చెందిన బుదిరెడ్డి మురళి విద్యుత్ స్తంభం ఎక్కి వైర్లు సరి చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్ గురై కింద పడిపోయాడు. దీంతో ఆయన్ను స్థానికులు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. ఈ విషయంపై లైన్ ఇన్‌స్పెక్టర్ రామ అప్పారావును వివరణ కోరగా విద్యుత్ సమస్యలపై తమకు ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. గ్రామంలో విద్యుత్ సిబ్బంది అందుబాటులో లేరని, మూడు నెలలుగా తమ గ్రామానికి లైన్మెన్ లేరని, దీనిపై విద్యుత్ ఉన్నతాధికారులకు పలుమార్లు తెలియజేసినా స్పందించలేదని సర్పంచ్ గిడుతూరి ఈశ్వరరావు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామానికి విద్యుత్ సిబ్బందిని అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

79వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

ప్రజాశక్తి - పరవాడ

గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధిలోని గల్లవానిపాలెం, కర్నాల వీధి ప్రాంతాల్లో ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మంగళవారం పర్యటించారు. వార్డులో నెలకొన్న డ్రైనేజీ, మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సుబ్బరాజు, ఎం.వెంకటరావు, సింగిడి సింహాచలం, గల్లా సూర్యనారాయణ, భరత్, ఇంజనీరింగ్ శాఖ ఏఈ పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే సమగ్ర రీ సర్వే

ప్రజాశక్తి-కోటవురట్ల

రైతుల సమక్షంలోనే రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలని తహశీల్దార్ తిరుమలబాబు సిబ్బందికి సూచించారు. మూడవ విడత సర్వేలో భాగంగా కైలాస్ పట్నం గ్రామంలో రీ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో 300 సర్వే నెంబర్లు ఉన్నాయని 922 సబ్ డివిజన్లు, 1369.32 ఎకరాల ప్రభుత్వ భూమికి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు, కార్యక్రమంలో మండల సర్వేయర్ చిన్నిబాబు, ఆర్ఐ మణికంఠ, విఆర్ఓ రామకృష్ణ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల : వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కైలాసపట్నం గ్రామంలో ఫారెస్ట్ అధికారి వివేకానంద ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్యప్రాణులను సంరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కోటవురట్ల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, స్థానికులు

ఆశా కార్యకర్తల సమస్యలపై నిరసనలు


నక్కపల్లిలో వినతిపత్రాన్ని ఇస్తున్న ఆశావర్కర్లు

ప్రజాశక్తి-నక్కపల్లి:ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆశా వర్కర్ల యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో గొడిచెర్ల పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ, ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. టిఎ, డిఏలు ఇవ్వాలని, ఏఎన్ఎం ట్రైనింగ్ అయిన ఆశా కార్యకర్తలకు ప్రాధాన్యత ఇచ్చి పోస్టులు భర్తీ చేయాలని, ఆశా కార్యకర్త దహన సంస్కారాల ఖర్చులు రూ.20,000 చెల్లిం చాలన్నారు. మెడికల్, సాధారణ సెలవులు అమలు చేయాలని, అదనపు పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.రాజేష్, ఆశా వర్కర్ సీనియర్ నాయకులు తులసి, శిరీష, వరలక్ష్మి, వెంకటి, కృష్ణవేణి, పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ బొంతు వీధిలో పీహెచ్‌సి వద్ద మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. కనీస వేతనం 26,000గా అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు గణేష్, అనురాధ, పద్మ, శిరీష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట:తమకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో రోలుగుంట మండలం బుచ్చంపేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన చేపట్టి అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయు నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ ప్రతీ నెల వేతనాలు సక్రమంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు ఇందిర , రాము, వరలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

రావికమతం: ంమతం పీహెచ్సీ వద్ద ధర్నా నిర్వహించి, వినతి పత్రాన్ని సిహెచ్ఓ హేమ సుందర్ రావుకు అందజేశారు. జిల్లా ఆశా యూనియన్ ప్రధాన కార్యదర్శి వజ్రపు సత్యవతి మాట్లాడుతూ, ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలన్నారు.

యలమంచిలి : ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమలింగపాలెం, పెద్దపల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద మంగళవారం సిఐటియు ఆధ్వర్యాన ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము మాట్లాడుతూ పేదలకు 20 సంత్సరాలుగా ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించాలని, వారిని కార్మికులుగా గుర్తించి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. పెన్షన్ , రెండు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం వైద్యాధికారులకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆశ యూనియన్


నర్సీపట్నంలో


కోటవురట్లలో నినాదాలు చేస్తున్న ఆశాలు

నాయకులు ఎ.కుమారి, ఎం.కనకలక్ష్మి, బుజ్జి, గోపి తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : ఆశ కార్యకర్తలు స్థానిక పిహెచ్సి వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. అనంతరం పిహెచ్సి వైద్యురాలు నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి ఈ పార్వతి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాల నియామకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, ఆశా వర్కర్లు కుమారి, వీర కోట, వెంకటలక్ష్మి, అరుణ, జయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ కె సోము నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అచ్చుతాపురం పిహెచ్‌సి ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు ఎన్ సూర్యలక్ష్మి, సిహెచ్ మంగమ్మ, ఎస్ పార్వతి, దేవుడమ్మ, పల్లవి, లావణ్య, దుర్గా, పోలమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని మంగళవారం పిహెచ్సి వద్ద ఆశవర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు చిరంజీవి మాట్లాడుతూ 5జి ఫోను సౌకర్యం కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గణేష్, అనురాధ, పద్మ, శిరీష, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

24వ రోజుకు మత్స్యకారుల రిలే దీక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి:తమ పోరాటానికి మద్దతు తెలుపుతున్న నాయకులపై పోలీసులు ఆంక్షలు, నిర్బంధాలు తగదని మత్స్యకారులు అన్నారు. తమ న్యాయమైన పోరాటానికి సంఘీభావం తెలుపుతున్న నాయకులను నిర్బంధించడం ఎంతవరకు సమంజసం అని మత్స్యకారులు ప్రశ్నించారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు మంగళవారం నాటికి 24 వ రోజుకు చేరింది. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సెక్షన్ 30 అమల్లో ఉందని పోలీసులు ఆంక్షలు విధించి, తమ పోరాటానికి సంఘీభావం తెలిపేందుకు వస్తున్న నాయకులను అడ్డుకోవడం, గృహ నిర్బంధం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రజా స్వామ్యాన్ని, ప్రజా హక్కులను పోలీసులు కాలరాస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు.
తమ పోరాటానికి సంఘీభావం తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజును


నినాదాలు చేసున్న మత్స్యకారులు

మూడు రోజులుగా గృహనిర్బంధం చేశారని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను ఆందోళన శిబిరానికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారని, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న రాజయ్యపేట వస్తుండగా, మంగళవారం పాయక రావుపేటలో పోలీసులు అడ్డుకున్నారని ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పోలీసులు ఆంక్షలు, నిర్బంధాలతో ఉద్యమాన్ని అణిచివేయలేరన్నారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా తమ జీవనోపాధికి, జీవన విధానానికి నష్టం చేకూర్చే బల్క్ డ్రగ్‌ను రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, మైలపల్లి మహేష్ బాబు, బొంది బాబ్జి, సోమేష్, సోమేశ్వరరావు, కాశీ, కోటి, నూకమ్మ పాల్గొన్నారు.

చర్చి స్థలాలపై విచారణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: సిబిఎం కాంపౌండ్‌లో చర్చి స్థలాలపై(పి జి ఆర్ ఎస్) . ప్రజా ఫిర్యాదులు వేదికలోలో ఫిర్యాదు మేరకు మంగళవారం నర్సీపట్నం తహశీల్దార్ రామారావు, ఆర్ఐ నాయుడు, సర్వేయర్ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు కుమార్. నాయుడు విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్


విచారణ చేపడుతున్న అధికారులు

మాట్లాడుతూ, చర్చికి సంబంధించి డాక్యుమెంట్స్, ఆధారాలు ఇవ్వాలని, త్వరలో డిజిటల్ సర్వే చేస్తామని అన్నారు.

శ్రీనిధి యాప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు : శ్రీనిధి యాప్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పలువురు జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీనిధి యాప్ ని తయారు చేశారని తెలిపారు. ఈ యాప్ ద్వారా డ్వాక్రా మహిళలు, శ్రీనిధిలోన్ తీసుకున్న ప్రతి సభ్యురాలు బ్యాంకులకు వెళ్లకుండా మొబైల్‌లోనే తిరిగి చెల్లించవచ్చున్నారు. యాప్లో రీపేమెంట్ షెడ్యూల్ వివరాలు పొందుపరచబడ్డాయని తెలియజేశారు. ఈ యాప్ ద్వారా తిరిగి చెల్లించవలసిన డబ్బుని దుర్వినియోగం అవ్వకుండా చెల్లించవచ్చని తెలిపారు.


అవార్డును అందుకుంటున్న సంఘ అధ్యక్షులు

మహిళా సంఘానికి స్వచ్ఛాంధ్ర అవార్డు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో డోంకాడ గ్రామంలో మహిళా సంఘానికి స్వచ్ఛ ఆంధ్రా అవార్డు వరించింది. కిచెన్ గార్డెన్స్ ఈవెంట్ విభాగంలో అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు అనకాపల్లిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా అవార్డును సంఘ అధ్యక్షులు కర్రి శ్రీదేవి, చిన్నారి, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీనాక్షి, వెలుగు సిసి అప్పారావు, విఓఏలు కళ్యాణి, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి కొత్తకోట:ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కొత్తకోట సీఐ జి కోటేశ్వరరావు కోరారు. కొత్తకోట సర్కిల్ కార్యాలయం ఆవరణలో కొత్తకోట శ్రీ శాంతి ఆటో యూనియన్ సభ్యులతో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేగం కంటే ప్రాణం గొప్పదనే విషయాన్ని వాహన దారులు గ్రహించాలన్నారు. కొత్తకోట, రావికమతం, రోలుగుంట తదితర గ్రామాలలో ముఖ్య రోడ్డు కూడలిలలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. అనుమతులు లేకుండా జనాన్ని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని సిఐ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న తహశీల్దార్

కుటుంబ సభ్యుల అంగీకారం తప్పనిసరి

ప్రజాశక్తి-నర్సీపట్నం:ప్రభుత్వం నుండి కుటుంబ సభ్యత్వ ధ్రువపత్రం పొందేందుకు కుటుంబ సభ్యుల అంగీకారం తప్పనిసరిగా ఉండాలని తహసిల్దార్ రామారావు అన్నారు. శారద నగర్ 2 సచివాలయ పరిధిలో ఇటీవల మరణించిన పెదపాటి రాజారావు, విశ్రాంత హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఇద్దరు భార్యలు మొదటి భార్య పార్వతికి అబ్బాయి, అమ్మాయి ఉండగా, రెండవ భార్య సత్యవతికి అమ్మాయి ఉన్నారు.కుటుంబ సభ్యత్వ హెూదా ధ్రువపత్రం కోసం ఇరువురు కూడా వారి తల్లి పేరున దరఖాస్తు చేసుకోగా క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేపట్టారు,ఇరు వర్గాలు అందజేసిన వారి వారి ధ్రువపత్రాలను తహసిల్దార్ పరిశీలించారు. వివిధ సర్టిఫికెట్స్ తో పాటు స్టడీ సర్టిఫికెట్స్ లో ఇరువురికి కూడా తండ్రిగా రాజారావు నమోదు కావడంతో కుటుంబ హెూదా ధ్రువపత్రం ఇచ్చేందుకు నిరాకరించారు. ఇరువర్గాల అంగీకారం తప్పనిసరి అని లేని పక్షంలో కోర్టును ఆశ్రయించుకోవలసి ఉంటుందని తేల్చి చెప్పారు, ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాయుడు, గ్రామ రెవెన్యూ అధికారి బాలరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ప్రజాశక్తి-కొత్తకోట:బాల్య వివాహం చేసేందుకు ప్రయత్నిస్తున్న తల్లి దండ్రులను ఐసిడీఎస్ చైల్డ్ వెల్ఫేర్ అధికారులు అడ్డుకున్నారు. కొత్తకోట గ్రామానికి చెందిన 24ఏళ్ళ యువకునికి అగనంపూడి గ్రామానికి చెందిన 14ఏళ్ళ బాలికతో పెళ్లి నిశ్చయ మైంది. ఇటీవల నిశ్చితర్థం కూడా జరిపించారు.పెళ్లి సమాయాత్తం అవుతున్న నేపథ్యంలో మైనర్ అమ్మాయికి వివాహ ప్రయత్నం చేస్తున్నారని చైల్డ్ వెల్ఫేర్ సిబ్బందికి సమాచారం అందటంతో ఆ సంస్థ ప్రతినిధి అంబేద్కర్, రావికమతం ఐసిడీఎస్, సీడీపీఓ మంగతాయారు, సూపర్ వైజర్ ఉన్నిసా బేగం, మహిళా పోలీస్ నూకరత్నం, అంగన్వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి కొత్తకోటలో యువకుని ఇంటి కి వెళ్లి బాల్య వివాహ ప్రయత్నం నిలుపు చేయాలన్నారు. దీని ద్వారా జరిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం చట్ట రీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులకు సూచించి వివాహం ప్రయత్నం చేయబోమని అంగీకారపత్రం తీసుకున్నారు.



శానిటేషన్ పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో

తడి పొడి చెత్త సేకరణ పై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:తడి పొడి చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు అన్నారు. మండలంలో దేవవరం పంచాయతీ ఒడ్డిమెట్ట గ్రామంలో ఇంటింటా తడి పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. గ్రామ పరిసర ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలో మురుగును తొలగింపునకు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి చెత్తరహిత గ్రామాలుగా తీర్చి దిద్దాలన్నారు.

డ్రైయినేజీ నిర్మాణ పనులు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం బుచ్చంపేట గ్రామంలో పెద్దన్నయ్య సెంటర్ వీధిలో గత కొన్ని సంవత్సరాలుగా వర్షపు నీరు, వాడకం నీరుతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. దీంతో స్థానికులు సుర్ల నూకరాజు, కంఠం శెట్టి రాజేష్ ఇదే గ్రామానికి చెందిన అనిమిరెడ్డి రమణ (వార్డు కార్యదర్శి) దృష్టికి తీసుకు రావడంతో వెంటనే స్పందించి స్థానికులు సహాయ సహకారంతో, తన సొంత నిధులతో డ్రైనేజీ ఏర్పాటు చేశారు.



పరిశీలిస్తున్న వార్డు కార్యదర్శి

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి-పాడేరు:విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం పాడేరు మండలం గుత్తులు పుట్టు గ్రామం ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో సూపర్ 50 విద్యార్థుల మూడవ బ్యాచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరిలో ఏదో ఒక స్కిల్ దాగివుందన్నారు. మీలో ఒక విధమైన టాలెంట్ ఉన్నందున ఎంపిక అయ్యారన్నారు.సబ్జెక్ట్స్ పై పట్టుసాధించడమే కాకుండా ప్రెజెంట్ చేయడం చాలా కీలకమన్నారు. చిన్న చిన్న గ్రూప్ లుగా ఏర్పడి సబ్జెక్ట్‌లపై చర్చించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు పి.బి.కె పరిమళ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన


ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం కొత్తూరు పంచాయతీ గొల్లపేట గ్రామ మహిళలు మంచినీటి సౌకర్యం కల్పించాలని మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు మాట్లాడుతూ, గ్రామంలో 50 కుటుంబాలు 250 మంది జనాభా నివసిస్తున్నారన్నారు. 2023-24 సంవత్సరంలో జల జీవన్ మిషన్ ద్వారా 10వేల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం చేశారని, నేటికీ ట్యాంకు ద్వారా నీరు ఇవ్వడం లేదన్నారు. ప్రత్యేక బోరు షెడ్డు నిర్మాణం చేశారని, ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేశారని, కానీ నీరు ఇవ్వక పోవడంతో గ్రామంలో ఉన్న బోరు నుండి నీరు కలుషిత నీరు వస్తుందని చెప్పారు. దీంతో తరచూ అనారోగ్యం గురవుతున్నారని, నీటి కాలుష్యంతో ఆసుపత్రులు పాలవుతున్నారన్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నేటికీ పట్టించుకోలేదన్నారు.ఇప్పటికైనా స్పందించి మంచినీటి సౌకర్యం కల్పించాలని లేకుంటే ఎంపీడీవో కార్యాలయం వద్ద బిందెలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మహిళలు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు గోవిందరావు, గ్రామస్తులు

ఆర్గానిక్ అగరబత్తుల తయారీ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: నాతవరం మండలం మాధవనగరం గ్రామంలో శ్రీనల్లకొండమ్మ పండుగ సందర్భంగా చమ్మచింత మహిళా శక్తి ఆధ్వర్యంలో మహిళలు స్వయంగా ఆర్గానిక్ అగరబత్తులను తయారు చేశారు. ఈ అగరబత్తుల ప్రొడెక్ట్‌ను జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర కొనుగోలు చేశారు. నల్లగొండమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఈ ప్రోడక్ట్ ను ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా వీరికి అవసరమైన రుణాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కూనిశెట్టి జోగురాజు, మహిళలు అనూష, సుజాత, తులసి, ధనలక్ష్మి, మేరీ తదితరులు పాల్గన్నారు.



అగరబత్తుల ప్యాకెట్లను ఇస్తున్న సూర్యచంద్ర

పోడు పట్టాలపై గ్రామసభ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: కొండపోడు వ్యవసాయం సాగు చేస్తూ అర్హులైన గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేసేందుకు గాను స్థానిక కండ్రుమ్ పంచాయతీలో ఆ పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ల పోరం మండల అధ్యక్షుడు కే.హరి ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 37 మంది లబ్ధిదారులను గుర్తించి సభలో తీర్మానం చేసి సంబంధిత అధికారులకు పంపించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఎం కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ కే.ప్రతిమ, వార్డు సభ్యులు కృష్ణ, సద్దు, తదితరులు పాల్గొన్నారు.

రైవాడ కాలువపై బ్రిడ్జి పునర్నిర్మాణం వెంటనే చేయాలి



కాలువపై బ్రిడ్జి క్రుంగిపోయిన ప్రాంతం వద్ద వెంకన్న నిరసన

ప్రజాశక్తి-దేవరాపల్లి : అనకాపల్లి, వేపాడ మండలాల సరిహద్దుల్లో ఉన్న కృష్ణరాయుడుపేట వద్ద రైవాడ కాలువపై క్రుంగిపోయిన బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జిని తక్షణమే నిర్మాణం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. కృష్ణరాయుడుపేట వద్ద బ్రిడ్జిని మంగళవారం వెంకన్న పరిశీలించారు. అనంతరం దేవరాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ప్రయాణికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణరాయుడుపేట సమీపంలో బ్రిడ్జి క్రుంగిపోయి బస్సులు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, దీంతో విశాఖపట్నం నుండి కొత్తవలస మీదుగా దేవరాపల్లి వెళ్లే బస్సులు కృష్ణరాయుపేట బ్రిడ్జి వద్ద ఆగిపోవాల్సి వస్తుందని చెప్పారు. దీని వల్ల అక్కడి నుండి ఆనందపురం, దేవరాపల్లి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారంతా ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని, ఇది విద్యార్థులకు, ప్రయాణికులకు ఆర్థిక భారం అవుతుందని చెప్పారు. ఈ బ్రిడ్జి మీదుగా ఆర్టీసీ బస్సులు రాక పోకలు ఆగి పోయి సుమారు మూడు నెలలు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం బ్రిడ్జి పునర్నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దీనిపై ఇప్పటికే అనేక సార్లు ప్రజాసంఘాలు ఆందోళన చేసిన పలితంగా కె.కోటపాడు ఆర్ అండ్ బి ఏఈ, జివిఎంసి వారు దీనికి టెండర్ కూడా పిలిచారని పేర్కొన్నారు. ఎస్టిమేషన్ వాల్యూ రూ.91 లక్షలు వేశామని, కాంట్రాక్టర్లు ఎవరూ రాలేదని అధికారులు చెప్పడం సిగ్గు చేటన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ బ్రిడ్జి పునర్నిర్మాణాన్ని చేపట్టి, ప్రజలు కష్టాలను తీర్చాలని వెంకన్న డిమాండ్ చేశారు.



దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న వెంకన్న, ప్రయాణికులు

డీ మార్ట్, మోర్ షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని డీ మార్ట్, మోర్ షాపుల్లో జీఎస్టీ 2.0 అమలు తీరును మంగళవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ప్రత్యక్షంగా పరిశీలించారు. జీఎస్టీ 2.0 అమలుకు ముందు, సెప్టెంబరు 22 తర్వాత తగ్గిన ధరల తేడాను వారు వినియోగదారులకు వివరించారు. ఈ సందర్భంగా తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య మాట్లాడుతూ జీఎస్టీ రేట్లలో మార్పుల కారణంగా ముందుగా తయారైన, ప్యాక్ చేయబడిన లేదా దిగుమతి చేసిన అమ్మబడని నిల్వలపై కొత్త చిల్లర అమ్మకపు ధర (ఎంఆర్‌పీ) ప్రకటించాలన్నారు. తాజాపరిచిన ధరలను స్టిక్కర్లు, స్టాంపింగ్ లేదా ఆన్‌లైన్ ప్రింటింగ్ ఉపయోగించి వినియోగదారులకు తెలియజేయాలని సూచించారు. కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జీఎస్టీ సంస్కరణలు మిశ్రమంగా అమలవుతున్నాయని ఆరోపించారు. వస్తువుల ధరల ట్యాగ్‌లూ మారలేదన్నారు. సాధారణంగా పండగల సమయానికి ముందుతో పోలిస్తే, పండగ ఆఫర్ల సమయంలో ఎమ్ఆర్‌పీలను కంపెనీలు పెంచి చూపుతున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ ఇనస్పెక్టర్ వేలమూర్తి రామారావు, కన్స్యూమర్ రైట్స్ సేఫ్‌గార్డింగ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, రాంబిల్లి వినియోగదారుల మండలి అధ్యక్షుడు ఎస్.నూకరాజు, కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నందవరపు సంజీవరావు, బొడ్డేడ జగ్గఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్తను తొలగించాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని శ్రీరాంపురం మూడవ వార్డు, మెరకవీధిలో చాలా కాలం నుంచి పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని గ్రామానికి చెందిన ముప్పిన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో చెత్త పేరుకుపోవడం వలన దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దోమలు విపరీతంగా పెరిగిపోయి స్థానికులు జ్వరాలు బారినపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి వైవి సత్యనారాయణకు ఎన్నిసార్లు విజ్ఞప్తిలు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. జల్ జీవన్ మిషన్ పైప్ లైన్ పనులు అసంపూర్తిగా వదిలివేయడం వలన ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని తెలిపారు.